

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం

12 ఫిబ్రవరి 2026 పేజీలు : 08

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్‌ను పునరుద్ధరించండి

- కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఎంపీ వేమిరెడ్డి వినతి
- ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల కెరీర్ అవకాశాలు మెరుగుపడతాయి
- అదనపు నైపుణ్యాలను అందించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుంది
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి, పునరుద్ధరణ చర్యలు తీసుకుంటామని వెల్లడి




## చిత్త శుద్ధితో విధులను నిర్వహించండి



- మార్గదర్శకులుగా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దండి
- మాహా శివరాత్రికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయండి
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

అప్పగించిన విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశించారు. బుధవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో జేసి మొగిలి వెంకటేశ్వర్లతో కలసి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మండలస్థాయి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో ఎస్ఎస్‌సి - 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, ఎస్ఎస్‌సి విద్యార్థుల దీర్ఘకాల గైర్హాజరు వారికి రెసిడెన్షియల్ శిబిరాలు, పాఠశాలల్లో సివిల్ పనుల స్థితి, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, అక్షర ఆంధ్ర, 1 నెల - 1 గ్రామం - 4 సందర్శనలు, ఇన్‌యాక్టివ్‌గా ఉన్న ప్రభుత్వ అకౌంట్లను వాడుకలోకి తీసుకురావడం, ఈ - పంట నమోదు, ఉద్యమ్ పోర్టల్ నమోదు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను కట్టుదిట్టంగా అమలు చేసి పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని గణనీయంగా పెంచాలన్నారు. ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించడం, నియమిత మాక్ టెస్టులు చేపట్టడం, విద్యార్థుల ప్రగతిపై నిరంతర మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక రెసిడెన్షియల్ శిబిరాలు నిర్వహించి వారిని ఉత్తీర్ణత సాధించే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో కొనసాగుతున్న సివిల్ పెండింగ్ పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సమగ్ర శిక్ష శాఖకు చెందిన ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేసి నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేయాలని ఆదేశించారు.

శివరాత్రి పండుగను పురస్కరించుకుని దేవాలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ విషయమై ఆర్డీవోలు పర్యవేక్షణ చేయాలన్నారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను వేగంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలన్నారు. అర్జీలను కేవలం స్వీకరించి పరిష్కరించడం కాకుండా ప్రజలకు శాశ్వత పరిష్కారం అందించడమే -మిగతా 2లో




## రాబోయే తరమే.. దేశ భవిష్యత్తు

- నెల్లూరు టౌన్ ఏఎస్పీ దీక్ష
- సిఐఎస్ఎఫ్ జవాన్లు చేపట్టిన సైకిల్ ర్యాలీకి ఘన స్వాగతం




సిఐఎస్ఎఫ్ జవాన్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైకిల్ ర్యాలీ బుధవారం నెల్లూరు టౌన్‌కు చేరుకోవడంతో ఎస్పీ ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ సూచనలతో టౌన్ ఏఎస్పీ దీక్ష ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, ఎన్‌సీసీ విద్యార్థులు వారికి ఘన స్వాగతం పలికారు.

## మూలస్థానేశ్వరుని బ్రహ్మోత్సవాల ధ్వజారోహణ

2 లో



## ఖోఖోలో చిచ్చర పిడుగులు

- కష్టాలను అధిగమించి.. రాణిస్తూ..!
- జాతీయ పోటీలకు ఎంపిక

8లో

తమ ఆశయానికి కష్టాలు ఏమాత్రం అడ్డు కాదని నిరూపించారు బీవీనగర్‌కు చెందిన కె.రమ్య, కె.భవాని. తల్లిదండ్రులు రోజువారీ కూలీలు అయినప్పటికీ ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఖోఖోలో రాణిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.






## వినూత్న ఆలయాల సమాహారం.. కాశీ నాయనాశ్రమం

# రాబోయేతరమే.. దేశ భవిష్యత్తు : ఏఎస్పీ దీక్ష

## సీఐఎస్ఎఫ్ జవాన్లు చేపట్టిన సైకిల్ ర్యాలీకి ఘన స్వాగతం



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** తీర ప్రాంతాల భద్రత, దేశ రక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా సిఐఎస్ఎఫ్ జవాన్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైకిల్ ర్యాలీ బుధవారం నెల్లూరు టౌన్‌కు చేరుకోవడంతో జిల్లా ఎస్పీ ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ సూచనలతో నెల్లూరు టౌన్ ఏఎస్పీ దీక్ష ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, ఎన్‌సీసీ విద్యార్థులు వారికి ఘన స్వాగతం పలికారు. ముందుగా ర్యాలీ వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టౌన్ ఏఎస్పీ మాట్లాడుతూ.. తాను సైక్లిస్ట్ అని, ఇలాంటి సైకిల్ ర్యాలీలు మీకు జీవితంలో చాలా మధుర స్మృతులు నిలుపుతాయని, మీరే రాబోయేతరం దేశ భవిష్యత్తు అని సైకిలిస్టులను ఉద్దేశించి తెలియజేశారు. అదేవిధంగా దేశ శాంతి భద్రతల పరిరక్షణలో కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం కీలక పాత్ర పోషిస్తుందని, డ్రగ్స్ విక్రయం కొనుగోలు చేసిన వారిపై ఎన్‌డిపిఎస్ యాక్ట్ ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సిఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంపత్ కుమార్ ఈ సందర్భంగా ర్యాలీ వివరాలు వెల్లడిస్తూ.. వందేమాతరం పోస్టల్ సైక్లోథాన్-2026 పేరిట ఈ సైకిల్ ర్యాలీ వంద మందికి పైగా సైకిలిస్టులతో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సైకిల్ యాత్ర జనవరి 28న కోల్‌కతా నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 23వ తేదీ కేరళ రాష్ట్రం కొచ్చిలో ముగియనుందని తెలిపారు. అదేవిధంగా 9 రాష్ట్రాలలో సుమారు 6500 కిలోమీటర్ల మేర, ప్రతిరోజు సుమారు 150 నుండి 160 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. సముద్ర తీర ప్రాంతాల రక్షణ, కోస్తా సెక్యూరిటీ ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ప్రధాన లక్ష్యమని, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడడంపై ఈ ర్యాలీ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఇండియన్ కోస్టల్ గార్డ్ కెపి పోర్ట్ కమాండెంట్ కార్తీక్ వీ మారుతి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షాలిని, దర్గా మిట్ట సిఐ, ఆర్ఐ వెల్ఫేర్, సిఐఎస్ఎఫ్, పోలీసు అధికారులు, ఈగల్, ఎన్‌సీసీ, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హాజరయ్యారు. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగంలో పాల్గొన్న ఆమె.. ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి, సంక్షేమ ప్రణాళికలను స్వాగతించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఈ సందర్భంగా గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ బడ్జెట్ దిక్సూచిగా మారుతుందని స్పష్టం చేశారు. బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా ముఖ్యంగా మహిళా సంక్షేమం, గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేయాలని ఆమె ఈ సందర్భంగా కోరారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్‌ను పునరుద్ధరించండి

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** కందుకూరు పట్టణంలో ఉన్న ప్రతిష్టాత్మక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గతంలో ఉన్న ఎన్‌సీసీ (నేషనల్ క్యాడెట్ కార్ప్స్)ను తిరిగి పునరుద్ధరించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయానికి వెళ్లిన ఎంపీ వేమిరెడ్డి.. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి ఎన్‌సీసీ పునరుద్ధరణపై వినతి పత్రం అందజేశారు. జనవరి 31న మియావాకీ ఫారెస్ట్ ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా కందుకూరులోని టిఆర్ఆర్ డిగ్రీ కళాశాలకు వెళ్లిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది.. కాలేజీలో ఎన్‌సీసీ పునరుద్ధరించేలా కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వెంటనే స్పందించిన ఆయన.. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి ఎన్‌సీసీపై పూర్తి వివరాలు అందించారు. ఏర్పాటుపై కలిగే ప్రయోజనాలు వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థ అయిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ యువత అభివృద్ధికి మూలస్తంభంగా పనిచేస్తోందని, యువతలో ఐక్యత, క్రమశిక్షణ, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. 1948లో ఎన్‌సీసీ ప్రారంభమవగా.. సరిగ్గా 8 సంవత్సరాల తర్వాత అంటే 1964లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఏర్పడిందని తెలిపారు. 1964 నుండి విజయవంతంగా నడుస్తున్న ఎన్‌సీసీ విభాగం నుంచి చాలా మంది ఎన్‌సీసీ క్యాడెట్లు భారత సైన్యం, పోలీసు వంటి వాటిలో చేరి సేవ చేస్తున్నారన్నారు. అయితే కళాశాల పరిపాలనలో కొంత లోపం కారణంగా శాశ్వత అసోసియేట్ టీజ ఆఫీసర్ (ఏఎన్ఓ) అందుబాటులో లేకపోవడంతో 2023లో టీఆర్ఆర్ కళాశాల నుండి ఎన్‌సీసీ యూనిట్‌ను ఉపసంహరించారని వెల్లడించారు. ఎన్‌సీసీ యూనిట్ మూసివేయడం వల్ల విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడిందని, శిక్షణ పొందాలనుకునే క్యాడెట్‌లకు దూరమైందన్నారు. ప్రస్తుతం కళాశాలలో సాధారణ అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి ఉన్నారని, మళ్లీ ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేయగలిగితే నేవీ శిక్షణతో పాటు తీరప్రాంత విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఎన్‌సీసీ శిక్షణ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్‌ను పునరుద్ధరించేలా సంబంధిత అధికారులకు సూచించాలని కేంద్ర మంత్రికి ఎంపీ వేమిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎంపీ విజ్ఞప్తులను పరిశీలించిన కేంద్రమంత్రి రాజ్‌నాధ్ సింగ్ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకుంటామని, శిక్షణ, మార్గదర్శకత్వం అవకాశాలను పొందేలా చూస్తామన్నారు.

## మూలస్థానేశ్వరుని బ్రహ్మోత్సవాల ధ్వజారోహణ





**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నగరంలోని మూలాపేటలో గల భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా బుధవారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా స్వర్గీయ మాడిశెట్టి కోటయ్య, సుబ్బరత్నమ్మ జ్ఞాపకార్థం కుమారులు వరదరాజులు, శివకుమార్, శ్రీనివాసులు, మనవడు కోటిగౌతమ్.. శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి మంగళవాయిద్యాల మధ్య ధ్వజస్తంభాన్ని దర్భతో చేసిన పవిత్ర దర్భాన్ని, వస్త్రాన్ని ధ్వజస్తంభానికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి దూప దీప నైవేద్యాన్ని సమర్పించి సకల దేవతలను ఆహ్వానిస్తూ దేవస్థాన అర్చకులు, పాలక మండలి చైర్మన్, సభ్యులు, కార్యనిర్వహణాధికారి తదితరులు ధ్వజారోహణ, ధ్వజపటంతో ఆవిష్కరించి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను ఉత్సవంగా పురవీధుల్లో ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లు రాత్రి సింహవాహనంపై ఊరేగారు. ఈ వేడుకకు భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ పుట్టా అజయ్ కుమార్ రెడ్డి, పాలకమండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, ఎక్స్ అఫీషియో ధర్మకర్త వందవాసి శివకుమార్ గురుకుల్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## చిత్త శుద్ధితో విధులను నిర్వహించండి

(మొదటి పేజీ తరువాయి)

వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ కార్యక్రమం ఉద్దేశ్యం అన్నారు. ఇందులో భాగంగా రెవెన్యూ యంత్రాంగం ఆయా గ్రామాలను నెలలో నాలుగు సార్లు సందర్శించి రికార్డు లోపాలు, సర్వే తేడాలు, భూవివాదాలు తదితర సమస్యలను గుర్తించి అదే నెలలో ఎవరికి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం కల్పించాలన్నారు. ఇన్‌యాక్టివ్‌గా ఉన్న ప్రభుత్వ అకౌంట్ల వివరాలపై కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల బ్యాంకు ఖాతాలన్నీ వాడుకలో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు రిక్వెస్ట్ లెటర్, ఆధార్, సిటిసి, ఐడీకార్డుతో ఆయా బ్యాంకుల్లో సంప్రదించి ఇన్‌యాక్టివ్ ఖాతాలను వాడుకలోనికి తీసుకురావాలన్నా రు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని యుద్ధప్రాతిపదికన ఈ -పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు చేయని ఎంఎస్ఎంఈ యూనిట్లను వెంటనే పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) ఉద్యమ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌ను చట్టబద్ధమైన గుర్తింపుగా ప్రవేశపెట్టిందన్నారు. ఉద్యమ రిజిస్ట్రేషన్ ఎంఎస్ఎంఈ యూనిట్లకు చట్టబద్ధమైన గుర్తింపుగా ఉండి, బ్యాంకు రుణాలను పొందుటకు అవసరమని తెలిపారు. జిల్లాలో నమోదు చేయని యూనిట్లను ఉద్యమ పోర్టల్‌లో నమోదు చేయించేందుకు మండలస్థాయిలో వర్క్‌షాప్‌లు నిర్వహించాలని, యంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్వో విజయకుమార్, జిల్లా అధికారులు కలెక్టరేట్ నుండి పాల్గొనగా, ఆర్డీవోలు, ఎంపిడీవోలువారి కార్యాలయాల నుండి హాజరయ్యారు.

## ఎంపీ వేమిరెడ్డికి రుణపడి ఉంటాం

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** సాగర్ మిత్ర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి తాము ఎప్పుడూ రుణపడి ఉంటామని ఏపీ సాగర మిత్ర ఎంప్లాయిస్ యూనియన్ నెల్లూరు అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, సభ్యులు స్వప్న, ఆశ్రిత, లక్ష్మీ తదితరులు అన్నారు. తక్కువ జీతానికి పనిచేసే తమ జీవితాలపై ఒక ఆశ కల్పించేలా కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ దృష్టికి తమ సమస్యలు తీసుకువెళ్లడంపై వారు బుధవారం ఎంపీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 15 వేలకు పనిచేసే తమ సమస్యలపై స్పందించిన ఎంపీకి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. సాగర్ మిత్రల సేవలపై కేంద్ర మంత్రికి వివరించారని, తమ సేవలను కొనసాగించేలా చూడటం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.

# 15న శ్రీఅన్నపూర్ణాసమేత శ్రీకాశీవిశ్వేశ్వరుల కళ్యాణోత్సవం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో వెలసియున్న శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వ రాలయంలో ఈనెల15వతేదీ శివరాత్రి వేడు కలను ఆలయ భక్తమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు, రాష్ట్ర అర్చక,పురోహిత సంఘ అధ్యక్షుడు బ్రహ్మశ్రీ మేళ్ళచెరువు శివ కుమార్ శర్మ (శివయ్యస్వామి) పేర్కొన్నారు. అమ్మవారు, స్వామివార్ల కళ్యాణోత్సవాన్ని వీనులవిందుగా నిర్వహిస్తామన్నారు. ఉదయం 11గంటలకు జరుగనున్న స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవానికి ఉభయకర్తలుగా రేవూరుకు చెందిన డాక్టర్ దేవిరెడ్డి కార్తీకేయరెడ్డి- మైథిలి(అమెరికా), మాజీ జెడ్పి చైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి-కవిత దంపతులు వ్యవహరిస్తారన్నారు. ఉదయం 11.30గంటలనుండే పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం రాత్రి వరకు జరుగుతుందని శివకుమార్‌శర్మ పేర్కొన్నారు. 15వతేదీ ఉదయం 3గంటలకు ఆలయంలో శ్రీస్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం భక్తబృందం ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఉదయం 5గంటలకు తాళ్ళూరు చంద్రశేఖర్-పుష్పలత దంపతులు ఉభయకర్తలుగా అమ్మవారికి చందనాలంకారం జరుగుతుందన్నారు. ఉదయం 7గంటలకు పుచ్చలపల్లి రవీంద్రారెడ్డి-రాధిక దంపతులు ఉభయకర్తలుగా పార్థివలింగ రుద్రాక్షలింగాభిషేకం, త్రిశతాధిక కలశాభిషేకం జరుగుతుందని శివయ్యస్వామి వివరించారు. ఉదయం 11గంటలకు శ్రీవార్ల కళ్యాణోత్సవం జరుగుతుందని, 11.30గంటలకు దివంగత పుచ్చలపల్లి రామిరెడ్డి గతంలో ఏర్పాటుచేసిన భారీ అన్నదాన కార్యక్రమం ఉంటుంద న్నారు. రాత్రి 8గంటలకు శ్రీఅన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వర స్వామివార్లకు పి.జవహర్‌లాల్-రమణమ్మ దంపతులు ఉభయకర్తలుగా అష్టోత్తరశతకలశాభిషేకం జరుగుతుం దన్నారు. రాత్రి 10గంటలకు లింగోద్భవకాలంలో శ్రీఅన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వరస్వామివార్లకు కుక్క పల్లి శ్రీనివాసులునాయుడు-కిరణ్మయి దంపతులు ఉభ యకర్తలుగా అన్నాభిషేకం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతాయని శివకుమార్‌శర్మ పేర్కొ న్నారు. ఈ ఉత్సవాలకు భక్తులు విరివిగా హాజరై స్వామి, అమ్మవార్లను సందర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని, స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని శివయ్యస్వామి కోరారు.

## కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో షాప్ దగ్ధం

**మనుబోలు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మనుబోలు కోదండరాం పురంలో కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో ఫ్యాన్సీ షాప్ దగ్ధమైంది. సుమారురూ 3.5లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు షాప్ యజమాని సురేష్ చెప్పారు. మంగళవారం రాత్రి 1.30 సమయంలో షాపు మూసేసి సురేష్ ఇంటికి వెళ్ళాడు. ఆ సమయంలో షాపులో కరెంటు షార్ట్ సర్క్యూట్‌తో షాపులో మంటలు వ్యాపించాయి. చూసినవాళ్లు షాప్ యజమానికి సమా చారం ఇచ్చారు. వెంటనే సురేష్ చుట్టుపక్కల వాళ్ళు వచ్చి షాపులో మంటలు ఆర్పే ప్రయత్నం చేసేసరికి చాలా వస్తువులు మంటల్లో కాలిపోయాయి.

## శివరాత్రికి మంత్రి ఆనం శైవక్షేత్రాల సందర్శన



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారా యణరెడ్డి ఈనెల 15వ తేదీన శివరాత్రి పర్వదినోత్సవం సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గంలోని శైవక్షేత్రాలను సందర్శించనున్నారు. 15వ తేదీ ఉదయం 9గంటలకు మండలకేంద్రమైన సంగంలోని శ్రీ కామాక్షి దేవిసమేత శ్రీసంగమేశ్వరస్వామి ఆల యాన్ని సందర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొననున్నారు. 11గంటలకు చేజర్ల మండలంలోని కోటితీర్థం లో శ్రీ కామాక్షిసమేత శ్రీకోటీశ్వరాలయాన్ని సందర్శించుకొని పూజల్లో పాల్గొంటారు. 2గంటలకు అనంతసాగరం మండలం సోమశిలలోని శ్రీ కామాక్షిసమేత శ్రీసోశ్వరాలయాన్ని సందర్శించుకొని పూజల్లో పాల్గొం టారు. 4గంటలకు అనంతసాగరం మండలం చిలకలమర్రిలోని శ్రీమల్లెం కొండేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొంటారు. 6గంటలకు ఆత్మకూరు పట్టణంలోని శ్రీ అన్నపూర్ణాసమేత శ్రీకాశీవిశ్వేశ్వ రాలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొంటారు. రాత్రి 8గంటలకు నెల్లూరులోని మూలాపేటలో వెలసియున్న శ్రీ భువనేశ్వరిసమేత శ్రీమూల స్థానేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు.

# ప్రగతి ప్రస్థానంలో నెల్లూరు టౌన్, రూరల్ డివిజన్లు

- ఎస్ఈ మార్గదర్శకాలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల పర్యవేక్షణ భేష్
- సబ్ డివిజన్, సెక్షన్ స్థాయి ఇంజనీరింగ్ అధికారుల చొరవ
- పిఎం సూర్య ఘర్ పథకం పై విస్తృత ప్రచారం
- కరెంటోళ్ళ జనబాట ద్వారా సమస్యలు గుర్తింపు, పరిష్కారం
- సమస్యలు తలెత్తిన ప్రతిచోట సిబ్బంది ప్రత్యక్షం
- ఓల్టేజ్, అంతరాయాలపై నిరంతర నిఘా చర్యలు

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తు న్న ప్రోత్సాహం, అధికారులు, సిబ్బంది శాఖా పరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు కనబరుస్తున్న అంకితభావం తోకూడిన బాధ్యతాయుతమైన పనితీరు, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ చేస్తున్న కృషి వెరసి సత్ఫలి తాల సాధనతో ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, నెల్లూరు జిల్లా ఆధీనంలో ఉన్న టౌన్, రూరల్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్లు ప్రగతి ప్రస్థానం తో దూసుకుపోయేందుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కారణమవుతున్నా యనడంలో సందేహం లేదనిపిస్తుంది. ప్రజల నిత్యవసరాల్లో భాగమైన విద్యుత్ పంపిణీ సంస్థ ద్వారా నాణ్యమైన నిరంతర సేవలు అందించే లక్ష్యం తో ప్రభుత్వాలు అమలు చేస్తున్న వినూత్న సంక్షేమ..అభివృద్ధి పథకాల ద్వారా మరింత చేరువవుతున్నాయి. గృహ, వ్యాపారం, వాణిజ్య వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు చెందిన వినియోగదారుల సౌకర్యార్థం, వారికి బహుళ ప్రయోజనాలు చేకూర్చడంతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన, ఉచిత విద్యుత్, రాయితీ, కరెంటోళ్ళ జనబాట తదితర పథకాలకు సంబంధించిన కార్యక్రమా లను ప్రభుత్వం అమలులోకి తీసుకురావడం తో పాటు విస్తృత ప్రచారంతో ప్రజలు, వినియోగదారులకు అవగాహన కల్పించడంలో విద్యుత్ అధికా రులు సఫలీకృతులైనట్లు తెలుస్తుంది. ప్రభుత్వం అందిస్తున్న విద్యుత్ అభివృద్ధి సంక్షేమ పథకాలను సక్రమరీతిలో ముందుకు తీసుకెళ్లేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కంకణ బద్ధులైన విద్యుత్ డివిజన్, సబ్ డివిజన్, సబ్ స్టేషన్ల స్థాయి అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో చేపడుతున్న అవగాహన సదస్సుల ద్వారా ప్రజలకు వివరిస్తున్నారు.

**నెల్లూరు టౌన్ డివిజన్‌లో :** నెల్లూరు టౌన్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్ ఆధీనంలో ఉన్న ఏకే నగర్, రామ్మూర్తి నగర్, రాజేంద్రనగర్ తదితర 3 సబ్ డివిజన్ల పరిధిలోని 12 సెక్షన్లలో ఉన్న సర్వీసులు ద్వారా నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరాతో గృహ వాణిజ్య వ్యాపార రంగాలకు చెందిన వినియోగదారులను సంతృప్తి పరచడంతోపాటు విద్యుత్ సంస్థ పై నమ్మకాన్ని కలిగిస్తున్నారు. ఉన్నతాధికారుల మార్గదర్శకాలను శిరోధార్యంగా భావిస్తూ ప్రభుత్వ నిర్దేశ లక్ష్యాలకు అనుగుణంగా మెరుగైన పనితీరుతో అడుగులు వేస్తున్నారు. లో వోల్టేజ్, హై వోల్టేజ్, అంతరాయాలు, ట్రాన్స్ ఫార్మర్ల రిపేర్లు వంటి సమస్యలు తలెత్తిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన రంగంలోకి దిగుతున్న అధికారులు, సిబ్బంది గంటల వ్యవధిలోనే పరిష్కారం చూపుతున్నారు. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని ప్రజలు వినియోగదారులకు నిత్యం అందుబాటులో ఉంటున్న వివిధ స్థాయిలకు చెందిన అధికారులు, సిబ్బంది ప్రభుత్వం అందిస్తున్న విద్యుత్ అభివృద్ధి, సంక్షేమ, రాయితీ పథకాల వల్ల సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన సగటు వినియోగదారుడికి చేకూరే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూనే, మరోవైపు ఎప్పటికప్పుడు తలెత్తే సమస్యలను గుర్తించి తక్షణ చర్యలతో పరిష్కరించడంతోపాటు విద్యుత్ అంతరాయాలకు ప్రత్యక్షంగాను పరోక్షంగాను కారణమవుతున్న చెట్ల కొమ్మలు.. కేబుల్ వైర్లు, క్రీపర్స్ తొలగింపు పనులు వేగవంతం చేస్తూ గంటల వ్యవధిలోనే యథావిధిగా కరెంట్ సరఫరాను యథావిధిగా పునరుద్ధరించడంలో శక్తి వంచన లేకుండా చేస్తున్న కృషితో అంతరాయాలు, ప్రమాద, అసౌకర్య రహిత వాతావరణాన్ని అందిస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు, వినియోగదారుల నుంచి మన్ననలు పొందుతుండటం విశేషం.

**నెల్లూరు రూరల్ డివిజన్‌లో :** నెల్లూరు రూరల్ డివిజన్ ఆధీనంలో ఉన్న ముత్తుకూరు, నెల్లూరు రూరల్, పొదలకూరు, రాపూరు తదితర 4 సబ్ డివిజన్లలోని 61 విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో ఉన్న 2 లక్షల పైబిలుకు గృహ, వ్యవసాయ, ఆక్వా, పారిశ్రామిక రంగాలకు చెందిన సర్వీసులున్నాయి. ప్రభుత్వ ఆదేశాలు, విద్యుత్ ఉన్నతాధికారుల దిశ నిర్దేశాలను మనసా, వాచా, త్రికరణ శుద్ధిగా ఆచరిస్తున్న డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ స్థాయిల ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది మెరుగైన పనితీరుతో శాఖాపరమైన ప్రగతిని సాధించేందుకు కృషి చేస్తుండటంతో సమస్యరహిత వాతావరణం మధ్య వినియోగదారులకు సంతృప్తికరమైన రీతిలో నిరంతర ప్రాతిపదికన నాణ్యమైన విద్యుత్ సేవలు అందుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వం అందిస్తున్న విద్యుత్ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునే దిశగా ప్రజలు, వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది సక్సెస్ బాటలో ముందుకు సాగుతున్నారు. ఓవైపు ప్రభుత్వ లక్ష్య సాధనలో భాగమైన అభివృద్ధి సంక్షేమ పథకాల తాలూకు ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలు, వినియోగదారులకు చేరవేస్తూనే, వైపు ఎక్కడ కూడా విద్యుత్ అంతరాయాలకు అవకాశం లేకుండా నిరంతర పర్యవేక్షణతో కూడిన ప్రతిష్ట నిఘా చర్యల కార్యాచరణను వేగవంతం చేస్తున్నారు. ఇదే క్రమంలో గృహ, వ్యవసాయ పారిశ్రామిక ఆక్వా తదితర రంగాలకు ప్రోత్సాహాన్ని అందించే లక్ష్యంతో ప్రభుత్వం అందుబాటులోకి తెస్తున్న రాయితీ పథకాలతోపాటు కరెంటోళ్ళ జన బాట కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించే దిశగా బాధ్యతలను తీసుకున్న అధికారులు.. సిబ్బంది తమ వంతు బాధ్యతాయుతమైన పనితీరుతో నూరు శాతం లక్ష్యాలకు చెరువలో ఉండడం విశేషంగా చెప్పవచ్చు. సమస్య తలెత్తిన ప్రతిచోట నిమిషాల వ్యవధిలో ప్రత్యక్షమవుతున్న విద్యుత్ సిబ్బంది పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యే వరకు అందుబాటులో ఉంటూ ప్రజల మన్ననలు పొందుతుండటం విశేషం.

## నాణ్యమైన విద్యుత్ సేవలే లక్ష్యం..

### రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎల్ ప్రసాద్



నెల్లూరు రూరల్ డివిజన్ అధీనం లో ఉన్న 61 సెక్షన్ల పరిధిలోని గృహ వ్యాపార వాణిజ్య వ్యవసాయ పారిశ్రామిక రంగాలకు చెందిన వినియోగదారులను నాణ్యవంతమైన విద్యుత్ సేవలతో సంతృప్తి పరచడమే లక్ష్యంగా ఎంచుకుని ముందుకు అనుగుణం గా ప్రత్యేక యాక్షన్ ప్లాన్తో ముందుకు సాగుతు న్నాం. ప్రస్తుత సీజన్‌లో లో వోల్టేజి, హై వోల్టేజ్ సమస్యల పరిష్కారం తోపాటు అంతరాయాలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటు న్నాం. ప్రభుత్వ ప్రోత్సాహం, ఉన్నతాధికారుల సహకారం, కింద స్థాయి అధికారులు, సిబ్బంది కృషి, వినియోగదారుల భాగస్వామ్యాలతో మరింత మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు కృషి చేస్తాం.

## ప్రభుత్వం మార్గదర్శకాలే శిరోధార్యం

### టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్



ప్రభుత్వ మార్గదర్శకాలు, ఉన్నతాధికారుల సూచనలను శిరోధా ర్యంగా భావిస్తూ నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరాతో సేవలందించేందు కు శక్తి వంచన లేకుండా కృషి చేస్తు న్నాం. ఎక్కడ కూడా విద్యుత్ సమస్య లకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలతో కిందిస్థాయి ఉద్యోగు లను అప్రమత్తం చేస్తున్నాం. విద్యుత్తు లైన్లకు మరమ్మత్తులు, పోల్స్ మార్చిడి, చెట్ల కొమ్మలు తొలగింపు వంటి పనుల నిమిత్తం ఆయా సందర్భాల్లో చోటు చేసుకునే తాత్కాలిక విద్యుత్ త్రాయాలపై ముందస్తు పత్రికా ప్రకటన ద్వారా ప్రజలు, వినియోగదారులకు చేస్తున్నాం. నష్టాల బాటలో ఉన్న విద్యుత్ కంపెనీ సంస్థ లాభాల బాటలో మరింత ముందు కు తీసుకెళ్లేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాం. ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్తి యోజన పథకం కింద టౌన్ డివిజన్ పరిధిలో సోలార్ విద్యుత్ వినియోగదారుల సంఖ్య గణనీయంగా పెంచేందుకు అవసరమైన విస్తృత ప్రచారంతో ముందుకు అడుగులు వేస్తున్నాం. ఇదే క్రమంలో ఎక్కడికి అక్కడ సమస్యలు గుర్తించడంతోపాటు సత్వర చర్యలతో పరిష్కరించే దిశగా ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ ఆదేశాలను పాటిస్తూ కరెంటోళ్ళ జనబాట కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నాము.

## వినూత్న ఆలయాల సమాహారం

# కాశీనాయనాశ్రమం



- నిరంతరాయంగా అన్నదానం
- ఏకైక సరస్వతీ ఆలయం
- నిత్యం భక్తులకోలాహలం
- శివరాత్రి వేడుకలకు సన్నాహం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పురాతన చారిత్ర్యాత్మికస్థలమహత్యం.. ఆత్మకూరు శివార్లలో ప్రశాంత వాతావరణం.. ఆహ్లాదభరితప్రదేశం.. బొగ్గేరునదీతీరం.. వినూత్న విభిన్న ఆలయాల సముదాయం.. నిత్యం నిత్యకళ్యాణంపచ్చతోరణంగా విరాజిల్లుతున్న ప్రతేశం.. అదే ఆత్మకూరు శివార్లలోని తిరునాళ్లతిప్పపై ఉన్న శ్రీశ్రీశ్రీ కాశీనాయన ఆశ్రమం. ఈనెల15వతేదీన శివరాత్రి వేడుకలకు సమాయత్తమవుతున్న ఈ ఆశ్రమం ఆత్మకూరు ప్రాంతానికేకాకుండా పరిసరప్రాంతాలకు అత్యంత భక్తిరస, పవిత్ర, ప్రాముఖ్యత పొందింది. పచ్చనిచెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ధనిక, పేదా తేడాలేకుండా నిత్యం భక్తులతో కిటకిటలాడుతుంటుంది. ఈ ఆశ్రమప్రాంగణంలో తెల్లవారుఝామునుండి అర్ధరాత్రివరకు భక్తులతాకిడి, నిత్యాన్నదానం నిరంతరాయంగా కొనసాగుతుంటుంది. ఈనెల15వ తేదీన శివరాత్రి వేడుకలను ఆశ్రమప్రాంగణంలోని శివాలయంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు గావిస్తున్నారు. దాదాపు లక్షమందికి అన్నదాన ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. నెల్లూరు జిల్లాలోని సీతారామపురం మండలంకు చెందిన మహిమాన్వితుడుగా పేరుగాంచిన శ్రీకాశీ(రెడ్డి) నాయన పేరుతో అనేక ప్రాంతాల్లో ఆశ్రమాలు ఏర్పడగా దశాబ్దం క్రితం ఆత్మకూరు శివార్లలోని బొగ్గేరునదిగట్టున స్థలమహత్యం కలిగిన తిరునాళ్లతిప్పపై కాశీనాయన ఆశ్రమాన్ని నిర్మించారు. ఆనాటినుండి ప్రతినిత్యం నిరంతరాయంగా ఉదయం ఉపాహారంనుండి మధ్యాహ్నం, రాత్రి అన్నదానం కొనసాగుతుంటుంది. అందరి సమిష్టి సహకారంతో అంచెలంచెలుగా ఆశ్రమం కొనసాగుతుండగా శ్రీకాశీనాయనభక్తరేణువులు అంటూ పేద, ధని తేడాలేకుండా అనేకమంది ఆశ్రమంలో సేవలందిస్తుంటారు. ఈ ఆశ్రమ ఆవరణలో శ్రీవినాయకస్వామి, శ్రీఅయ్యప్పస్వామి, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి, శ్రీనాగకనకదుర్గాదేవి, శ్రీవీరభోగవసంతరాయులు, శ్రీవిరాట్‌పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి, శ్రీనాగార్పమ్మ, శ్రీసరస్వతిదేవి, తదితర ఆలయాలతోపాటు సప్తరుషులు, అష్టదిక్పాలకులు, నవగ్రహాలు, శివలింగం, తపోవనం తదితర విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఒక కళ్యాణమండపాన్ని కూడా నిర్మించారు. నాగకనకదుర్గాదేవి, దుర్గామల్లేశ్వరస్వామి, వీరభోగవసంతరాయులు ఆలయాలను కొండపై నిర్మించారు. కొండపై అందరినీ ఆకట్టుకునే విధంగా కాలభైరవుని విగ్రహం ఏర్పాటు చేశారు. ఈఆలయానికి నిత్యం వందలాదిమంది భక్తులు వచ్చేస్తుంటారు. వందలాదిమంది అన్నప్రసాదాన్ని స్వీకరిస్తుంటారు. శివరాత్రినాడు అత్యంత కోలాహలంగా భక్తిశ్రద్ధలతో శివనామస్మరణ మార్మోగుతుండగా శివ,పార్వతుల కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. రాష్ట్రంలోనే ఏకైక సరస్వతీదేవి ఆలయం ఉండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేకపూజలు చేయడంతోపాటు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అయ్యప్పస్వామి ఆలయం ఉండడంతో అయ్యప్పదీక్షలో ఉన్న స్వాములు ఇక్కడే పూజలు, ఇరుముడులు తదితరాలు చేస్తుంటారు. వినూత్న ఆలయాల సమూహంగా అలరారుతూ దినదినప్రవర్ధమానమవుతున్న కాశీనాయన ఆశ్రమంలోని శివాలయంలో శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయన భక్తులు ఏర్పాట్లు గావిస్తున్నారు.










# హరిహర పుణ్యక్షేత్రం పరమ పుణ్య ధామం

- శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిలయం
- మహాశివరాత్రి విశేష కార్యక్రమాలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం నల్లగొండ గ్రామంలోని నీలగిరి పర్వతంపై వెలసి యున్న హరిహర పుణ్యక్షేత్రం పరమ పుణ్యధామంగా విరాజిల్లుతుంది భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్న శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయం దివ్య క్షేత్రంగా వెలుగొందుచు గ్రామస్తులను కాపాడుతుంది కొండ దిగు భాగాన ఈశాన్యం దిక్కున శ్రీ గుహ మల్లేశ్వర స్వామి త్రయంబికదేవితో కలిసి కొలువై ఉన్నాడు సహస్ర పడగలతో లింగరూపుడై వెలసి ఉన్నాడు భక్తులకు దర్శన భాగ్యం కలిగిస్తూ హరిహరులుగా వెలసిన ఈ కొండ ప్రసిద్ధి పొంది అనతి కాలంలోనే భక్తుల మనోభీష్టములను తీరుస్తూ హరిహరులు ఉన్న ఏకైక గొప్ప దివ్య క్షేత్రమే ఈ నీలగిరి కొండగా ప్రసక్తి చెందింది శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారి ఆలయంలో ఆలయ పాలకమండలి చైర్పర్సన్ లెక్కలకాంత రెడ్డి లెక్కల చిన్న కొండారెడ్డిల ఆధ్వర్యంలో విశేష కార్యక్రమాలు నిర్వహింపబడుతున్నవి. శనివారం 14వ తేదీ ఉదయం 6 గంటలకు ఆలయ శుద్ధి గోపూజ స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, నలుగు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఉభయ దాతలుగా అంకెల పల్లె ఓబుల్ రెడ్డి గిరిజమ్మ దంపతులు వ్యవహరిస్తున్నారు మధ్యాహ్నం 12 గంటలకు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నపురెడ్డి నాగార్జున రెడ్డి సౌజన్యంతో భక్తులకు అన్నప్రసాదం అందించబడుతుంది. సాయంత్రం నాలుగు గంటలకు అన్నపూర్ణాదేవి గ్రామోత్సవం సామూహిక కుంకుమార్చన ఉంటుందన్నారు. కార్యక్రమానికి పసుపు కుంకుమ గాజులు రవి ఉచితంగా అందించబడతాయన్నారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా రూపునేని వెంకటసుబ్బయ్య రత్నమ్మ కుమారుడు వెంకటేశ్వర నాయుడు చరిత దంపతులు మరియు వారి కుమార్తెలుపర్ణిక తస్విక ఉభయ దాతలుగా వ్యవహరిస్తున్నారు రాత్రి 9 గంటలకు అన్న ప్రసాదములు చెరుకూరి చిన్నప నాయుడు సంపూర్ణ కుమారుడు చరణ్ ఏరుకొల్లు గ్రామానికి చెందిన వాస్తులో ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్నారు రాత్రికి గణేష్ ఈవెంట్స్ వారి సంస్థలో నిర్వహింపబడతాయని తెలిపారు అదే విధంగా 15వ తేదీ ఆదివారం రాత్రి 12 గంటలకు జాగరణ సందర్భంగా శివుని లింగోద్వ సమయంలో స్వామివారికి అన్నాభిషేకము మరియు గోక్షిర శివలింగ దర్శనం ఉంటాయన్నారు. లెక్కల చిన్న కొండారెడ్డి ధర్మపత్ని మరియు ఆలయ పాలకమండలి చైర్పర్సన్ లెక్కల కాంతారెడ్డి అన్నపురెడ్డి వెంగల్రెడ్డి సర్పంచ్ అన్నపురెడ్డి ప్రమీల, హైదరాబాదు చెన్నై వాసుల సహకారంతో స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహింపబడుతుందని తెలిపారు. వారితో పాటుగా ఆకిలి వెంకటేశ్వరరావు లీలావతి లెక్కల శ్రీనివాసరెడ్డి రమణమ్మ దంపతులు వ్యవహరించనున్నారు. ఇనగంటి నాగరాజ రాజరాజేశ్వరి, జీ వరలక్ష్మి గార్లచే శివనామ సంకీర్తన ఉంటుందన్నారు కావున ఈ కార్యక్రమానికి నల్లగొండలో గ్రామ పరిసరాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసి స్వామి వారి కృపా కటాక్షములు పొందగలరని కోరుకున్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో బండి

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : సీపీఐ

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పి. జిలానీ ఖాన్ పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరులోని సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ,కార్మికులు పోరాటాలు, ఉద్యమాలు చేసి ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం దుర్మార్గమని సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి అన్నారు. దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న 8 గంటల పని విధానం, కనీస వేతనం, ఉద్యోగ భద్రత వంటి హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే కార్మికుల పరిస్థితి యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టులో కార్మిక చట్టాలు అమలు కాకపోవడం, అదానీ సంస్థ కంటైనర్ టర్మినల్‌ను




తరలించుకుపోతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ. 26వేలకు పెంచాలని, స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12న ఉదయం 10 గంటలకు నెల్లూరులోని ఏబీఎన్ కాంపౌండ్ వద్ద నుండి ప్రారంభమయ్యే భారీ కార్మిక ప్రదర్శనలో కార్మికులు, రైతులు, విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు.

# పిల్లలకు పౌష్టికాహారం, పండ్లు, బిస్కెట్లు, స్వీట్లు పంపిణీ




**నెల్లూరు రూరల్ మేజర్‌న్యూస్ :** రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం తన్విక్ష జన్మదిన వేడుకలు పురస్కరించుకుని వారి తల్లిదండ్రులు భరత్ కుమార్, దివ్యశ్రీ ఆర్థిక సహాయంతో రవిచంద్ర గిరిజన కాలనీలోని పిల్లలకు పౌష్టికాహారం, స్వీట్లు, బిస్కెట్లు, పండ్లు, కేక్స్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి అనుముల జయప్రకాష్ మాట్లాడుతూ.. పిల్లలు నడువవలసిన త్రోవను వారికి నేర్పించిన ఎడల వారు పెద్దవారైనను దాని నుండి తొలగిపోరు అనే సూక్తిని తెలియజేస్తూ, తన్విక్ష ఉన్నత చదువులు చదివి ఆమె భవిష్యత్తులో మంచి ఉద్యోగాన్ని పొందాలని సమాజానికి అవసరమైనటువంటి ఒక మంచి వ్యక్తిగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. తన్విక్ష తల్లిదండ్రులైన భరత్ కుమార్, దివ్యశ్రీలు తమ బిడ్డకు చిన్నతనం నుండే సేవా భావాన్ని నేర్పించి సమాజానికి దిశా, నిర్దేశం అందించే వ్యక్తిగా తమబిడ్డ ఎదగాలని కోరుకోవడం వారి మంచితనానికి నిదర్శనమని, ఇలా ప్రతితల్లి, తండ్రి ఆలోచించి తమబిడ్డలను సమాజ శ్రేయస్సు కొరకు ఉపయోగపడేలా దిద్దితే భవిష్యత్తు తరాలలో మంచి మానవత్వానికి రూప రేఖలుగా ఆబిడ్డలు తయారవుతారని ఆయన అన్నారు. పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి ఇటువంటి పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నటువంటి పిల్లలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఎవరైనా తమ పుట్టినరోజు వేడుకలు లేదా పెళ్లి రోజు వేడుకలను తమ అసోసియేషన్ల వారికి తెలియజేస్తే వారి కార్యక్రమాన్ని ముందుకు నడిపించడానికి తమ అసోసియేషన్లు ఎప్పుడూ ముందుంటాయని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, రిటైర్డ్ ఏఎస్ఐ మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు సుభహాన్, నారాయణ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా డ్రైనేజీ నిర్మాణ పనులు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పట్టణంలోని స్థానిక ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయ సమీపంలోని ప్రధాన రహదారి నుండి సిద్ధార్థ నగర్ వరకు ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇటీవల ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించిన విషయం తెలిసిందే సుమారు కోటి 15 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన పనులను ఎంపీపీ వనిపెంట హైమావతి తెలుగుదేశం సీనియర్ నాయకులు వనిపెంట వెంకటసుబ్బారెడ్డిలు జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తున్నారు త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తి చేసి రానున్న రోజుల్లో ఎలాంటి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎక్కడ మురుగునీరు అక్కడే నిలబడి ఉండేదని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. నుండి నుడా నుండి 87 లక్షలు ఎంపీపీ గ్రాంట్ నుండి



30 లక్షల రూపాయలను హెచ్చించి ఈ డ్రైనేజీ నిర్మాణం జరుగుతుందన్నారు. కొన్ని దశాబ్దాలుగా పట్టణంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతుండేవారిని వర్షపు నీరు పోయే మార్గం లేక ఇబ్బందులతో సతమతమవుతుండే వారన్నారు వీటన్నిటిని అధిగమించేందుకు ఎమ్మెల్యే సురేష్ ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు అందులో భాగమే ఎమ్మెల్యే తోడ్పాటుతో మండలాన్ని మరింతగా అభివృద్ధి పదం నడిపించేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలను పనిచేస్తామని ఆయన తెలిపారు.

# స్వచ్ఛ సర్వేక్షన్ లో ఉత్తమ ర్యాంకు సాధించాలి

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సంస్థ వారిచే నియమించిన నాలెడ్జ్ పార్ట్నర్స్ అయిన ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ వారు నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ హెల్త్ వర్కర్లకు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నందు శిక్షణా తరగతులను బుధవారం నిర్వహించారు. శిక్షణా తరగతులకు ముఖ్య అతిథులుగా నగర పాలక సంస్థ ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమిషనర్ వైఓ నందన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇంచార్జ్ మేయర్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లో విధులను నిర్వహిస్తున్న పబ్లిక్



హెల్త్ కార్మికులు కార్పొరేషన్ అందించిన రక్షణ ఉపకరణాలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు విధుల నిర్వహణలో జాగ్రత్తలు పాటించి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమం పట్ల ప్రజలందరికీ అవగాహన కల్పించే వారంతా భాగస్వాములు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేలో నెల్లూరు నగరపాలక సంస్థకు ఉత్తమ ర్యాంకు వచ్చేలా ప్రతి ఒక్క సిబ్బంది కృషి చేయాలని కమిషనర్ సూచించారు.

## వీఆర్‌ఏలు సమ్మె నోటీసుల అందజేత

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని కోరుతూ గురువారం చేపట్టే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు పలువురు సమ్మె నోటీసులు



అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఇన్చార్జి తహసీల్దారు షాజియాకు వీఆర్‌ఏలు సమ్మెలో పాల్గొంటున్నట్లు నోటీసు అందజేశారు. అలాగే సీఐటీయూ నాయకులు బ్యాంకు ఉద్యోగులు, ఎన్నికల సిబ్బందికి నోటీసులు అందజేశారు. సార్వత్రిక సమ్మెలో ప్రతిఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, నాయబ్ రసూల్ దుగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## పలు పలు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా బుధవారం స్థానిక శెట్టి గుంట రోడ్డు, ఆత్మకూరు బస్టాండ్, వెంకటే



శ్వరపురం, పుత్తా ఎస్టేట్, రామ్మూర్తి నగర్ తదితర ప్రాంతాలలో అధికారులతో కలిసి పర్యటించారు. ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో రోడ్డు ఆక్రమణలను గుర్తించి స్వచ్ఛందంగా తొలగించుకోవాలని యజమానులకు సూచించారు. వెంకటేశ్వరపురం ప్రాంతంలో జరుగుతున్న షాదీ మంజిల్ స్లాబ్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. నిర్దేశించిన సమయం లోపు పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం రామ్మూర్తి నగర్ ప్రాంతంలో జరుగుతున్న ఎండ్ టు ఎండ్ సిసి రోడ్డు నిర్మాణ పనులను కమిషనర్ పర్యవేక్షించి అధికారులకు వివిధ సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నెల్లూరు నగర పాలక సంస్థ స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు అదనపు కమిషనర్ హిమబిందు, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రహంతు జానీ,అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మార్చి నాటికి లబ్దిదారుల పక్కాగృహాల నిర్మాణాలను పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ మోహన్ రావు సూచించారు. బుధవారం



మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి వద్ద ఏర్పాటు చేసిన లేఅవుట్లోలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 235 పక్కాగృహాలు నిర్మాణం జరుగుతుందన్నారు. వాటిలో ఫేజ్-3 కింద నిర్మించే ఇళ్ల నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు నాణ్యతాప్రమాణాలు పాటించి మార్చి చివరి నాటికి పూర్తి చేస్తే బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు సకాలంలో మెటీరియల్ అందజేసి త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ డీఈ పీరాన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**జలదంకి, మేజర్‌న్యూస్ :** నేడు జలదంకిలో జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు రావి మాల్యాద్రి కార్మికులకు కర్షకులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం జలదంకిలోని స్థానిక




పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రం జలదంకిలో గురువారం సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ప్రతీ మండల కేంద్రంతోపాటు, దేశ వ్యాప్తంగా సమ్మె జరుగుతుందన్నారు. లేబర్ కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి కార్మికులను కష్టాలపాలు చేస్తుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర రావాలన్నా, కార్మికుల కష్టాలు తీరాలన్న ధర్నాలో పాల్గొని సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. బిజెపి నిరంకుశ వైఖరిని తిప్పి కొట్టాలంటే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆంటోనీ బాబు పాల్గొన్నారు.

# గూడూరును రెవెన్యూ డివిజన్‌గా కొనసాగించండి : కాంగ్రెస్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** బ్రిటిష్ కాలం నుండి రెవెన్యూ డివిజన్‌గా కొనసాగుతున్న పురాతనమైన గూడూరును రెవిన్యూ డివిజన్‌గా కొనసాగిం చాలని బుధవారం నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ను వినతిపత్రం ద్వారా కోరినట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జిల్లాల విభజన పేరుతో గూడూరును ముక్కలు చెక్కలు చేయగా, అంతకుమించి ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం అడ్డగోలుగా గూడూరును చిలువలు చేసిందని వాపోయారు. అంతేకాకుండా తద్వారా మూడు మండలాలతో కూడిన గూడూరు అనేక వనరులు రైల్వే జంక్షన్, సహజ వన రులు, వ్యాపార, వాణిజ్యపరంగా ఎంతో అభివృద్ధి చెందిన గూడూరు రెవెన్యూ డివిజన్ హోదా కోల్పోతుందని, కావున ప్రభుత్వము వెంటనే చొరవ తీసుకొని దగ్గర్లోనున్న సైదాపురం, మనుబోలు మండలాలను గూడూరులో కలిపి రెవిన్యూ డివిజన్‌గా కొనసాగించాలని గూడూరు ప్రజల పక్షంగా విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కే.సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఒక్కొక్కటిగా ప్రభుత్వ శాఖలు గూడూరు నుండి తరలిస్తున్నారని, విద్యార్థులకు మహిళలకు రైతులకు రెవిన్యూ



డివిజన్ లేకపోవడం ఎంతో నష్టాన్ని ఆవేదన కలిగిస్తుందని అన్నారు. అదే విధంగా అన్ని వర్గాల ప్రజలకు ఎంతో సెంటిమెంట్‌తో కూడిన ఈ విష యాన్ని వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని సైదాపురం, మనుబోలు మండ లాలను గూడూరులో కలిపి రెవిన్యూ డివిజన్‌గా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, బుచ్చి మండల కాంగ్రెస్ నాయకులు కిషోర్, లీగల్ సెల్ సుధీర్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్ఫాన్, ఎన్ఎస్‌యుఐ రాజా తదితరులు పాల్గొన్నారు.

# నేడు కావలికి ఏపీసీసీ వైయస్ షర్మిల రాక




**కావలి, మేజర్‌న్యూస్ :** బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో ఉపాధి హామీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాన్ని రద్దు వద్దును వ్యతిరేకించేందుకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి కావలికి రానున్నట్లు కావలి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పొదలకూరు కళ్యాణ్ తెలిపారు. స్థానిక ఎస్సార్ పార్క్ హోటల్ నందు బుధవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ.. గురువారం మధ్యాహ్నం సమయంలో కావలి రూరల్ మండలం ఆముదాల దిన్నె గ్రామానికి వస్తున్నట్లు తెలిపారు. బిజెపి కూటమి పార్టీలపై వారు ప్రజలకు చేస్తున్న అన్యాయాలు ఉపాధి హామీ పథకం కొత్త జీవోను తీసుకొచ్చి వారికి అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టెడు అన్నం పెట్టే ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ధ్వజమెత్తారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విబిజి రామ్ జి పథకాన్ని తెస్తుందని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఈ పథకాన్ని నిరసిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి యాత్ర చేస్తున్నారని తెలిపారు. ఉపాధి హామీ కార్మికులు రైతు కార్మికుల సమస్యలు తెలుసుకునేందుకు రానున్నట్లు తెలిపారు. మహాత్మా గాంధీ ఉపాధి పథకం ద్వారా100 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చేదని ఇప్పుడు ప్రవేశపెట్టబోయే పథకం ద్వారా 60 శాతం కేంద్రం 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాలని బిజెపి పార్టీ మాట్లాడుతుందని ఇప్పటివరకు మన రాష్ట్రంలో చూసినట్లయితే కూటమి ప్రభుత్వం మూడు లక్షల కోట్ల అప్పులు చేయడం ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న రాష్ట్రాలు ఏ విధంగా ఈ పథకానికి 40 శాతం నిధులు కేటాయిస్తారని వారు ప్రశ్నించారు. వైసీపీ కుటుంబ ప్రభుత్వం ఈ పథకాన్ని గురించి పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వానికి బదిలీలు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలకు అండగా ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ అనిల్ కుమార్ రెడ్డి బోగోలు, దగదర్తి, అల్లూరు మండలాల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

# ప్రజల విశ్వాసమే మా బలం ప్రజల సేవే మా లక్ష్యం

## జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** వీధి చివర్లో మీటింగ్ పెట్టుకుని వెళ్లే నాయకులను చాలామందిని చూసాం. కానీ ప్రతి గడపను తట్టుతూ, ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటే నెత్తిన పెట్టుకుని చూస్కుంటాం అంటూ సాదరంగా ప్రజలు కిషోర్‌ను ఆహ్వానిస్తున్నారు. ఈ సందర్భంగా జనసేన జనసేన నాయకులు గురుకుల కిషోర్ మాట్లాడుతూ.. 16వ డివిజన్‌లో స్పష్టంగా కనిపించింది. 'నేను రిక్షా తొక్కుకునే వాడిని, నారాయణ సార్ నాకు బండి ఇచ్చారు' అని ఆనందంగా ఓ తాత చెప్పిన మాటలు హృదయాన్ని తాకాయి. 'పవన్ కళ్యాణ్ దేవుడు, గిరిజన ప్రాంతాలకు కూడా రోడ్లు వేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను పెంచుతున్నారు' అంటూ స్థానికులు కూటమి ప్రభుత్వ సుపరిపాలనపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఆప్యాయమైన పలకరింపులతో ప్రతి గడపకి జనసేన కార్యక్రమం నెల్లూరు సిటీ 16వ డివిజన్ గుర్రాల మడుగు సంఘంలో నిర్వహించబడింది. స్థానిక ప్రజల సమస్యలు, ఇబ్బందులు తెలుసుకుంటూ, కూటమి ప్రభుత్వ సంక్షేమ



పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఈ కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల, ఏఎంసీ డైరెక్టర్, జనసేన వీర మహిళ విజయలక్ష్మి, 16వ డివిజన్ నాయకులు నరహరి, విశ్వనాథ్, వీర మహిళలు కల్పన, భవాని, ప్రవల్లిక, జనసేన నాయకులు అశోక్, శివ, మూలాపేట శివాలయం కమిటీ సభ్యులు హేమచంద్ర యాదవ్, 2వ డివిజన్ నాయకులు బాలు, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పండిట్ దీన దయాల్ ఉపాధ్యాయ సంస్మరణ : బీజేపీ నేత మిడతల రమేష్

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** బీజేపీ సిద్ధాంతకర్త దీన దయాల్ ఉపాధ్యాయ 57వ వర్ధంతి సందర్భంగా మూలాపేటలో సంస్మరణ కార్యక్రమం జరిగింది. బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత మిడతల రమేష్ మాట్లాడుతూ.. నిరుపేదలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని తను రూపొందించిన సిద్ధాంతంలో ఉపాధ్యాయ పేర్కొన్నారు. నీతి నిజాయితీ ఆధ్యాత్మిక విలువలు కలిగిన సిద్ధాంతం బీజేపీ సిద్ధాంతమని తెలిపారు. మనిషిని కేవలం ఆర్థిక జీవిగా పరిగణించకూడదు



దేశీయ వనరులను ఉపయోగించుకుంటూ అభివృద్ధి చెందాలని బీజేపీ సిద్ధాంతం తెలుపుతుందన్నారు. అందరికీ సమన్యాయం జరగాలని బీజేపీ భావిస్తుందని నేతలు తమ ప్రసంగాలలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కందికట్ల రాజేశ్వరి. మిడతల రమేష్, అల్లూరు నాగేంద్ర సింగ్, సుజనా, పద్మావతి, మురగ నరేష్, నాగలక్ష్మి, విజయశ్రీ, కే.శివకుమార్, టి శ్రీనివాసులు, జె.శ్రీకృష్ణ, గంగుల జనార్ధన్, నరాల సుబ్బారెడ్డి, నారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ : ఎంఈఓ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని హరిజన పాఠశాలను బుధవారం కావలి ఎంఈఓ బండి గోవిందయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అనంతరం జాదుయి పిటారాలోనే వస్తువులను పరిశీలించి, వాటి ఉపయోగం నిలిచి రెండవ తరగతి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన సమాధానాలకు సంతృప్తి చెందారు. అనంతరం విద్యార్థులతో మమేకమై పిల్లలతో మధ్యాహ్నం భోజనం గురించి ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలు గురించి అడిగి వారి సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అలాగే మధ్యాహ్న భోజనం ప్రభుత్వం అందిస్తున్న పథకాన్ని పిల్లలకు సక్రమంగా వినియోగించాలని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

# అక్రమ సస్పెన్షన్ పై కొనసాగిన నిరసన

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి ఆర్టీసీ డిపోలో కండక్టర్గా పని చేస్తున్న జగదీష్ బాబు అక్రమసస్పెన్షన్ను ఎత్తివేయాలని రెండోరోజైన బుధవారం సైతం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎంయుఏ వర్కింగ్ ప్రెసిడెంట్ కాశీవిశ్వనాథ్, డిపో మాజీ కార్యదర్శి మౌలీలు మాట్లాడుతూ.. అక్రమ సస్పెన్షన్ను రద్దు చేసేవరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. తనిఖీ అధికారులు నమోదు చేసిన కేసు ఆధారంగా డిపో మేనేజర్ వాస్తవాలు తెలుసుకోకుండా, విచారణ చేయకుండా ఏకపక్షంగా సస్పెన్షన్ చేయడం దారుణమన్నారు. సస్పెన్షన్ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ ఏ నాయకులు శంకర్, వెంకటేశ్వర్లు, నాగరాజు, సూరి, బాష, ఫణికుమార్, రామాంజనేయులు, విజయకుమార్, జలీల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ కార్యకర్త మృతి



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్పేట గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త సయ్యద్ షఫీ అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు ఈ మేరకు సయ్యద్ షఫీ భౌతికకాయాన్ని రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మండల టిడిపి కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు సందర్శించి నివాళులర్పించి సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కన్వీనర్ వెంట మండలంలోని టిడిపి నాయకులు పాల్గొని సంతాపాన్ని తెలియజేశారు.

# వివాదాస్పద స్థలం పరిశీలన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక శివాలయం సమీపాన ఉన్న వివాదాస్పద స్థలాన్ని బుధ వారం ఇన్‌చార్జ్ తహసీల్దారు షాజియా, ఎస్ఐ కర్నాటి ఇంద్ర సేనారెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 15వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కార్యక్రమాలను నిర్వహించేందుకు నిర్వాహకులు శివాలయానికి ప్రక్కనే ఉన్న స్థలాన్ని చదును చేశారన్నారు. ఆ స్థలం రెవె న్యూ శాఖకు సంబందించి కావడంతో అక్కడ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పర్వదిన కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు మరో స్థలాన్ని పరిశీలించి భక్తుల కు ఏలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపడతామన్నారు. కార్యక్ర మంలో వీఆర్వో మాలకొండయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు విద్యుత్‌కి అంతరాయం

**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, తూర్పు రొంపిదొడ్ల సబ్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 10 గంట నుండి సుమారు 4గంట వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని కరెంట్ డిపార్టెంట్ ఏఈ కుద్దూస్ భాష బుధవారం ఒ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రెండు సబ్ స్టేషన్లో పరమత్తుల కారణంగా విద్యుత్‌కి అంతరాయం ఉంటుందని, ఆయా గ్రామాలలోని రైతులు, విద్యుత్ వినియోగదారు లు సహకరించాలని కోరారు.

# ఖోఖోలో చిచ్చర పిడుగులు




**▸ కష్టాలను అధిగమించి.. రాణిస్తూ ▸ జాతీయ పోటీలకు ఎంపిక**

**నెల్లూరు/బారకాసు, మేజర్‌న్యూస్ :** తమ ఆశయానికి కష్టాలు ఏ మాత్రం అడ్డు కాదని నిరూపించారు. బీవీనగర్‌కు చెందిన కె.రమ్య, కె.భవాని. తల్లిదండ్రులు రోజువారీ కూలీలు అయినప్పటికీ ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఖోఖోలో రాణిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. స్టేడియం వద్దకు ఉదయం, సాయంత్రం వేళల్లో క్రమం తప్పకుండా వచ్చి సాధన చేశారు. జిల్లా, రాష్ట్ర, సీనియర్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొం టూ ఎంతో మంది సహకారాన్ని అందుకున్నారు. చిన్న వయస్సులోనే జాతీయస్థాయి పోటీలకు ఎంపికై జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. చిన్నారుల ప్రతిభను గుర్తించిన ఖోఖో అసోసియేషన్ నేతలు గురుప్రసాద్, గిరిప్రసాద్, విజయ్‌కుమార్ ఆర్థికంగా సహకారం అందించారు. 'నా పట్టుదలే ఉన్నత స్థాయికి తీసుకొచ్చింది. ఎప్పటికైనా ఇండియన్ టీమ్‌కు ఆడాలనే సంకల్పం నెరవేరాలని కోరుకుంటున్నాను' అని కోచ్ కె.సుకుమార్ తెలిపారు.

**భళా.. కె.రమ్య :** బీవీ నగర్‌కు చెందిన రమ్య తల్లిదండ్రులు ఈశ్వర్‌రావు, గౌరీ రోజువారీ కూలీలు. 12 ఏళ్ళ వయస్సులో వేసవి శిక్షణ శిబిరానికి మొదటిసారిగా రమ్య హాజరయ్యారు. కేఎన్నార్ స్కూల్‌లో ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు చదివారు. ప్రస్తుతం జిఎన్‌ఎం మొదటి సంవత్సరం చదువుతున్నారు. జూనియర్ నేషనల్స్, సీనియర్ నేషనల్స్, పశ్చిమ బెంగాల్‌లో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. 2023లో నిర్వహించిన ఖేలో ఇండియా పోటీల్లో స్వర్ణ పతకం సాధించారు. ఒడిశాలోని అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. 2025లో బిహార్‌లో జరిగిన ఖెలో ఇండియా యూత్ గెంస్ పోటిల్లో స్వర్ణ పథకం సాధించడం జరిగింది.

**భేష్.. కె.భవాని :** కె.భవాని తల్లి కూలీ, తండ్రి లేడు, బాలసదన్‌లో పెరిగింది. ప్రస్తుతం భవాని జడ్పీహెచ్‌ఎస్ దర్గామిట్ట హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-18 జూనియర్ నేషనల్స్ విభాగంలో రాణించారు. జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమంగా రాణించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. జనవరి 27 నుండి 29 వరకు జరిగిన ఆల్ ఇండియా ఇన్విటేషన్ టోర్నమెంట్‌లో బంగారు పథకం సాదించడం జరిగింది. ప్రస్తుతం ఇండియా అకాడమి, ఒడిస్సా రాష్ట్రంలో పూరిలో శిక్షణ పొందుతున్నారు.

# రైతుల బాధలు వర్ణనాతీతం : కాకాణి



**మనుబోలు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు మండలంలోని మొగుళ్ళూరు మనుబోలు మండలంలోని కట్టువపల్లి, మడమనూరు, గొట్లపాలెం గ్రామాలలో బుధవారం పర్యటించిన మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి పర్యటన చేశారు. ఈ సందర్భంగా కాకాని గోవర్ధన్‌రెడ్డి కూటమి ప్రభుత్వం పైన ఫైర్ అయ్యారు పలు విమర్శలు ఆరోపణలు చేశారు. యూరియా దొరకక అల్లాడిపోయామని కాకాణి ఎదుట ఆవేదన వ్యక్తం చేసిన రైతులు పంటలకు కనీసం మద్దతు ధర కల్పించేందుకు, రైతులకు అండగా నిలవాలని, కాకాణికి విజ్ఞప్తి చేసిన అన్నదాతలు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం, ధర్మరాజు పాలన అంటూ ప్రశంసించిన రైతులు కాకాణి కూటమి పాలనలో రైతుల బాధలు వర్ణనాతీతం, యూరియా అందక రైతులు పడ్డ బాధలు అన్నీ, ఇన్నీ కావు, తెలుగుదేశం పార్టీ వారు యూరియాని తమ ఇళ్లకు తరలించుకొని పోయి, అధిక ధరలకు బ్లాక్‌లో విక్రయించి సొమ్ము చేసు కోవడం దుర్మార్గం. సోమిరెడ్డి ఇరిగేషన్‌లో పనులు చేయకుండా దొంగ బిల్లులు చేసుకుంటుంటే, ఆయన శిష్యులు యూరియాను బ్లాక్‌లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. రైతులను అడ్డుపెట్టుకొని దోచుకుంటున్న, దుర్మా ర్గమైన ప్రభుత్వం, కూటమి ప్రభుత్వం రైతులకు పంట చేతికొస్తున్న సమ యాన కనీస మద్దతు ధర తప్పనిసరిగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వా నిదని కాకాణి విమర్శలు చేశారు. ప్రభుత్వం మొక్కుబడిగా ధాన్యం కొను గోలు కేంద్రాలు తెరిచి, రైతుల దగ్గర నుండి పంట కొనుగోలు చేయకపోతే, ఎట్టి పరిస్థితుల్లో కూడా ఉపేక్షించే ప్రసక్తే లేదు రైతుల దగ్గర నుండి కనీసం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేంతవరకు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పక్షాన రైతులకు అండగా నిలిచి, పోరాడుతాం. కూటమిపాలనలో కొత్త పెన్షన్‌లు మంజూరు కాక వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, తీవ్ర అవ స్థల పాలవుతున్నారు. సోమిరెడ్డి మాత్రం ప్రభుత్వం మంజూరు చేయలేదని తెలిసి కూడా, వాస్తవాలు దాచి పెట్టి అధికారులపై చిందులు వేయడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలన లేకపోవడం వలన, తాము అంతా తీవ్ర ఇబ్బందుల పాలయ్యామని, అన్ని వర్గాల ప్రజలు గ్రహించారు. తిరిగి జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకు నేందుకు, ప్రజలు ఆతృతగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. మణుగూరు మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హర గోపాల్‌రెడ్డి మనుబోలు టౌన్ అధ్యక్షులు ముంగర రవీందర్ రెడ్డి మాజీ జడ్పిటిసి దాసరి భాస్కర్ గౌడ్‌తో కాకాని మాట్లాడారు. ఇటీవల తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన సన్నారెడ్డి జానకి రామిరెడ్డిని, పసల శంకరయ్య, పద్మావతి, యాలపల్లి నరేంద్ర, ముప్పాళ్ళ వెంకటేశ్వర్లును కాకాణి పరామర్శించారు. మండలకన్వీనర్ బొమ్మిరెడ్డి హర గోపాల్‌రెడ్డి, మనుబోలు టౌన్ అధ్యక్షులు ముంగర రవీంద్రా రెడ్డి, కొలనకుదురు వైసీపీ నేత కసిరెడ్డి ధనుంజయరెడ్డి, మాజీ జడ్పీటీసీ దాసరి భాస్కర్ గౌడ్, కొండూరు రామ చంద్రారెడ్డి, కొండూరు జనార్దన్ రెడ్డి, ఈగా సురేష్, ఈగా గిరి పాల్గొన్నారు.

# ఆత్మకూరులో మెగాజాబ్‌మేళా 19న

**● 30కంపెనీల్లో 2వేల ఖాళీలు ● యువతకు సదవకాశం : ఆర్డీఓ పావని**




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో ఈనెల 19వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నామని స్థానిక ఆర్డీవో భూమిరెడ్డి పావని పేర్కొన్నారు. స్థానిక ఆంధ్రా ఇంజనీరింగ్‌కాలేజి ప్రాంగణంలో ఈ ఎంపికలు జరుగుతాయని ఆమె తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 19వతేదీ ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు ఎంపికలు జరుగుతాయని ఆమె తెలిపారు. 30కంపెనీల వారు ఈమెగా జాబ్‌మేళాలో పాల్గొని అర్హులైన వారిని ఉద్యోగాలకు ఎంపికచేసుకుంటారని ఆమె వివరించారు. ఈ 30కంపెనీల్లో 2వేల ఉద్యోగాలు ఖాళీలున్నాయన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నికల్, బి.టెక్ తదితర విద్యార్హతలు కలిగిన నిరుద్యోగులకు సదవకాశమని ఆమె తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగయువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో పావని కోరారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలు, విద్యార్హతలతో నైపుణ్యం.ఏపి.గవ్.ఇన్ అనే పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని ఆర్డీవో పావని పేర్కొన్నారు. కంపెనీల వారే తమ ముంగిటకు వచ్చి ఉద్యోగాలకు ఎంపికచేసుకుంటున్నందున ఈ మహత్తర అవకాశాన్ని నిరుద్యోగ యువతీ,యువకులు సద్వినియోగం చేసుకోవాలని, తమ భవిష్యత్తుకు మార్గం ఏర్పాటు చేసుకోవాలని పావని పేర్కొన్నారు. అన్నివిద్యాసంస్థల వారు కూడా ఈవిషయమై శ్రద్ధ తీసుకొని తమకు చెందిన నిరుద్యోగులను ఈమెగా జాబ్‌మేళాకు హజరయ్యేలా చూడాలని ఆర్డీవో కోరారు. జాబ్‌మేళాకు హాజరయ్యే యువతీయువకులు తమ విద్యార్హత సర్టిఫికేట్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులతో రావాలని ఆమె సూచించారు.

## ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధికి కృషి చేయాలి

**▸ ఏపీఐఐసీ చైర్మన్‌తో కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి**



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏపీఐఐసీ చైర్మన్ ఎం.రామరాజుని మర్యాద పూర్వకంగా టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కలిశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన కోసం నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఆమంచర్ల గ్రామంలో 59.61 ఎకరాలలో 13కోట్ల 26లక్షల రూపాయలతో అభివృద్ధి పనులను మంజూరు చేసినందుకు, మొదటి దశలో ఇప్పటికే 29.62 ఎకరాలలో రోడ్లు, డ్రైన్‌లు, విద్యుత్ పనులను పూర్తి చేసేందుకు సహకరిం చిన ఆయనకి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రెండోవ విడతలో మిగిలిన 30ఎకరాలలో ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి, అతిత్వరలో రెండవ దశ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి పనులను కూడా ప్రారంభించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు.

## మాజీ సీఎం వైయస్ జగన్‌ను కలిసిన పల్లాల



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని బుధవారం నెల్లూరు జిల్లా వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షులు పల్లాల కొండారెడ్డి తాడేపల్లి లో ఉన్న జగన్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వింజమూరు మండలంలోని ఇటీవల జరిగిన రాజకీయ పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు రానున్నవి మన రోజులేనని అధైర్య పడకుండా పార్టీ పటిష్టత కోసం పనిచేయాలని సూచించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట సూరం వినోద్ రెడ్డి గణపం బ్రహ్మానంద రెడ్డి అధికార ప్రతినిధి వీర శేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## శ్రీకాశీనాయన ఆశ్రమంను పరిశీలించిన డీఎస్పీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఈనెల15వతేదీ శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడనున్న ఆత్మకూరు శివార్లలోని తిరునాళ్ళ తిప్పవద్ద శ్రీకాశీనాయన ఆశ్రమంలో భద్రతా ఏర్పాట్లు గురించి బుధవారం స్థానిక డీఎస్పీ కె.వేణుగోపాల్ తదితరులు పరిశీలించారు. ఆశ్రమంలోని శివాలయంలో శివరాత్రి సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం జరుగనుంది. ఈ ఉత్సవాలకు అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. దాంతో భద్రతా ఏర్పాట్లు గురించి డీఎస్పీ వేణుగోపాల్, సిఐ జి.గంగాధర్, ఎస్ఐలు షేక్ జిలానీ, శ్రీనివాసులు, సిబ్బంది పరిశీలించారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండనున్న నేపద్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది, అసౌకర్యం లేకుండా తగిన ఏర్పాట్లు గురించి డీఎస్పీ ఆశ్రమ ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. వాహనాల పార్కింగ్, రద్దీనియంత్రణ, క్యూలైన్ల ఏర్పాటు తదితర అంశాల గురించి వారు చర్చించి పలు సూచనలు చేశారు. మహాశివరాత్రి వేడుకలు ప్రశాంతంగా భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించేలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నామని డిఎస్పి వేణుగోపాల్ పేర్కొన్నారు.

## నేడు మూలాపేట శివాలయంలో వేలంపాట

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేటలో వెలసియున్న శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారి దేవస్థానముకు సీల్డు టెండరు ప్రకటన ఇవ్వడమైనది అని ఆలయ అధికారులు తెలిపారు. ఫల సరుకులు, విద్యుత్ సామాన్లు, ప్రింటింగ్, రుద్రాభిషేకము సామాన్లు సప్లై చేయుటకు షరతులతో కూడిన టెండరు షెడ్యూలు పొందవచ్చునని తెలిపారు. 12వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు టెండరు దారులు సమక్షములో సీల్డు టెండర్లు తెరవబడి తక్కువ టెండరు దారుని పేరు ఉన్నతాధికారులు ఆమోదము కొరకు పంపబడును అని తెలిపారు. దేవస్థానమునకు బకాయిలు వున్నవారు గాని, సిబ్బందిగాని, ధర్మకర్తలు గాని సదరు కొటేషన్లు దాఖలు చేయుటకు అనర్హులుగా తెలిపారు.

# సాగర్ మిత్ర సేవలను కొనసాగించండి

- కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్‌కు ఎంపీ వేమిరెడ్డి వినతి
- సాగర్ మిత్రలు మత్స్యకార గ్రామాల్లో ఎన్నో సేవలు అందిస్తున్నారు
- పీఎంఎంఎస్‌వై, ఇతర పథకాల లబ్ధిని క్షేత్రస్థాయికి తీసుకువెళుతున్నారు
- వారి సేవలను మరింత కాలం పొడిగించడాన్ని పరిశీలించాలి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లాలో మత్స్యశాఖ కింద పనిచేస్తున్న సాగర్ మిత్రల సేవలను కొనసాగించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రి కార్యాలయంలో ఆయన్ను కలిసిన ఎంపీ.. ఆంధ్రప్రదేశ్ సాగర్ మిత్ర ఎంప్లాయీస్ యూనియన్ తరపున వినతిపత్రం అందజేశారు. పీఎంఎంఎస్‌వై (ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన) ఫేజ్-1 కింద నియమించబడిన సాగర్ మిత్ర సేవలు మార్చి 31వ తేదీకి ముగియనున్నాయని, ఫేజ్-1 ముగిసేతకు రెండు నెలల ముందే నోటీసు కూడా జారీ చేయబడిందన్నారు. ఈ దశలో వారి సేవలను అకస్మాత్తుగా నిలిపివేయడం పీఎంఎంఎస్‌వై కింద సాధించిన ప్రగతిపై ప్రతికూల ప్రభావం పడే వీలుందన్నారు. 2021-22లో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద నియమించబడిన సాగర్ మిత్రలు స్థానిక మత్స్యకారులకు వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల గురించి అవగాహన కల్పించడం, తీరప్రాంత మత్స్యకార వర్గాల మధ్య కీలకమైన అనుసంధానంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటివరకు తీరప్రాంత గ్రామాలలో అట్టడుగు స్థాయిలో పని చేస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్నా రన్నారు. మత్స్యకారులకు వాతావరణ సూచనలు, సంభావ్య ఫిషింగ్ జోన్లు, ప్రకృతి వైపరీత్యాలపై ముందస్తు హెచ్చరికలు, పీఎంఎంఎస్‌వై, ఇతర మత్స్యకార సంబంధిత పథకాలు, సబ్సిడీలు మొదలైన వాటిపై అవగాహన కల్పించడం, ఫిషింగ్ పద్ధతులను సులభతరం చేయడం, మత్స్యకారుల జీవనోపాధికి మద్దతు ఇవ్వడం వంటివి చేస్తున్నారన్నారు. వీటన్నింటి దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్చి 31వ తేదీ తర్వాత వారి సేవలను పొడిగించడానికి ఇప్పటికే వివర ణాత్మక ప్రతిపాదనలను సమర్పించిందని, కావున సాగర్‌మిత్రల పదవీకాలాన్ని మరింత కాలం పొడిగించడాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్.. సాగర్ మిత్రల సేవలు పొడిగించడంపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని, వారి సేవలు కొనసాగించేలా చూస్తామని అన్నారు.

# ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు తటవర్తి రమేష్ ఆధ్వర్యంలో సమావేశం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో బుధవారం సాయంకాలం కావలి పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షులు తటవర్తి రమేష్ ఆధ్వర్యంలో విట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ఆర్యవైశ్య నాయకులు వేముల సునీల్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశం రాష్ట్రంలో కావలి పట్టణంలో ఆర్యవైశ్యులకు ఇచ్చిన ప్రత్యేకత గౌరవం, ఎన్నడూ లేదని ఈ విషయంపై ప్రత్యేకంగా కావలి నియోజకవర్గం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి బిట్రగుంట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నేను గతంలో చేసిన సేవలను గుర్తించి నాకు ఈ పదవి ఇచ్చినందుకు ఎమ్మెల్యేకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తటవర్తి రమేష్, తటవర్తి వాసు మాట్లాడుతూ.. కావలి నియోజకవర్గంలో ఎన్నో పార్టీలు వచ్చాయి, పోయాయి.. కానీ ఆర్యవైశ్యులకు సముచిత స్థానం ఇంత పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్యులకి నామినేటెడ్ పదవులు ఇచ్చిన దాఖలు తెలుగుదేశం పార్టీలోనని, అది కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికే దక్కుతుందన్నారు. ఆర్యవైశ్యులకి అండగా ఉంటూ ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఏ సమస్య వచ్చినా.. నేనున్నాను.. అనే భరోసాని కల్పిస్తున్న ఎమ్మెల్యే కావ్యకి ఆర్య వైశ్యులు ఎప్పుడు వెన్నంటి ఉంటారని వారు తెలిపారు. అనంతరం దేవస్థానం బోర్డు మెంబర్లు ప్రతి ఒక్కరిని శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నామినేటెడ్ నాయకులు, బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి నూతనంగా నియమింపబడిన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రేపే రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం జరుగనున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో భాగంగా నెల్లూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఎన్నికల ఏర్పాట్లు ఊపందుకున్నాయి. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలకు సంబంధించి నెల్లూరు బార్ అసోసియేషన్ హాలులో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రం తదితర ఏర్పాట్లను రాష్ట్ర బార్ కౌన్సిల్ నెల్లూరు రిటర్నింగ్ అధికారి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పులిమి అయ్యప్ప రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి వచ్చిన బార్ కౌన్సిల్ బ్యాలెట్ పేపర్లు,పోలింగ్ బాక్సులు, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను నెల్లూరు బార్ కౌన్సిల్ రిటర్నింగ్ అధికారి పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల బరిలో రాష్ట్రవ్యాప్తంగా 145 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, అందులో నెల్లూరు నుంచి ఐదు మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అభ్యర్థులుగా పోటీ పడుతున్న వారిలో ప్రస్తుత రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు, సీనియర్ న్యాయవాది వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా శాఖ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది సత్తు అంకయ్య, నెల్లూరు బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ సీనియర్ న్యాయవాది డి.పణి రత్నం, ఓ.వెంకట్ రాజు, వొమ్మిన ఈశ్వర మనోజ్ కుమార్ పోటీ బరిలో ఉన్నారు. వీరితో. పాటు హై కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న పలువురు న్యాయవాదులు తిరుపతి కడప తదితర ప్రాంతాలలో ప్రాక్టీస్ చేస్తున్న పలువురు కూడా నెల్లూరు బార్ అసోసియేషన్‌పై ఆశలు పెట్టుకుని ఉన్నారు. నెల్లూరు జిల్లా కు సంబంధించి 3,545 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిసింది. ఈనెల 13 ఉదయం 10-30 నిమిషాలకు ప్రారంభమయ్యే ఓటింగ్ కొరకు పోలింగ్ కేంద్రంలో పాల్గొని న్యాయవాద ఓటర్లు తమ ఓటు హక్కును ఉపయోగించుకునేటప్పుడు ఐదు మంది అభ్యర్థులకు ప్రాధాన్యత ఓట్లు కచ్చితంగా వేయాల్సి ఉంటుందని, బార్ కౌన్సిల్ ఎన్నిక నియమావళి ప్రకారం ఓట్లు వేయాలని లేనిపక్షంలో అవి మురిగిపోయే ప్రమాదం ఉందని రాష్ట్ర బార్ కౌన్సిల్ నెల్లూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులిమి అయ్యప్ప రెడ్డి తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో పోటీ పడుతున్న అభ్యర్థులు వారి మద్దతుదారులు అయినా న్యాయవాదులు జిల్లా కోర్టు ఆవరణలో పలుచోట్ల షామియానా కేంద్రాలు బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల నుంచి అభ్యర్థుల ప్రచారం, ఓటింగ్ స్లిప్పులు పంచటం, ఓటర్లకు సహాయ పడటం తదితర కార్యక్రమాల కొరకు వీటిని ఏర్పాటు చేశారు. మరికొన్ని కేంద్రాలు గురువారం ఏర్పాటుచేసే అవకాశం ఉంది. జిల్లా కోర్టు ఆవరణలో బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీపడుతున్న అభ్యర్థులు వారి మద్దతుదారుల ఎన్నికల ప్రచారంతో జిల్లా కోర్టు ఆవరణ బుధవారం కోలాహలంగా మారింది.

# ఏపీ మీదుగా 116 కిసాన్ రైల్ సర్వీసులు

**ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర మంత్రి సమాధానం**



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** కేంద్ర రైల్వే శాఖ ప్రారంభించిన కిసాన్ రైల్ ప్రాజెక్టుపై నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పలు ప్రశ్నలు వేశారు. 2020 ఆగస్టులో 2,400 కిసాన్ రైలు సర్వీసులు ప్రారంభించగా.. ఆంధ్రప్రదేశ్ నుండి కేవలం 5 సర్వీసులు మాత్రమే నడుస్తున్నాయన్నది నిజమేనా.. అని ఆరా తీశారు. 2021-22 తర్వాత ఎలాంటి సర్వీసులు నిర్వహించబడలేదనేది వాస్తవమేనా.. అని ప్రశ్నించారు. ఏపీ నుండి కిసాన్ రైలును ప్రారంభించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ సమాధానమిచ్చారు. 2020 ఆగస్టు 7న కిసాన్ రైలు సేవ ప్రారంభించినప్పటి నుండి, రైల్వేలు 2,364 కిసాన్ రైలు సేవలను నిర్వహించాయని, సుమారు 7.9 లక్షల టన్నుల త్వరగా పాడైపోయే వస్తువులను రవాణా చేసి దాదాపు రూ. 318.68 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాయన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ నుంచి 116 సర్వీసులు నడపబడ్డాయని, అరటిపండ్లు, మామిడి, ఉల్లిపాయలు మొదలైన వాటితో సహా 34 వేల టన్నులకు పైగా త్వరగా పాడైపోయే వస్తువులను అస్సాం, బీహార్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, త్రిపుర వంటి రాష్ట్రాలకు రవాణా అయ్యాయన్నారు. కూరగాయలు, పండ్లు, ఇతర త్వరగా పాడైపోయే వస్తువులను తరలించడానికి కిసాన్ రైలు యొక్క సంభావ్య సర్క్యూట్‌లను వ్యవసాయం, రైతు సంక్షేమం, వ్యవసాయం/ పశు సంవర్ధక మంత్రిత్వ శాఖ/ రాష్ట్ర ప్రభుత్వాల మత్స్య శాఖలతో పాటు స్థానిక సంస్థలు, ఏజెన్సీలు, మండీలు మొదలైన వాటితో సంప్రదించి గుర్తిస్తారన్నారు. సేవలను డిమాండ్లు, కార్యాచరణ సాధ్యాసాధ్యాల ఆధారంగా రైల్ సేవలకు ప్రణాళిక చేస్తారని చెప్పారు.

# పంటలను పరిశీలించిన ఆత్మ పీడీ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని మర్రిపల్లి, ముదిగేడు మరియు డేగపూడి గ్రామాలలో ఛాంపియన్ రైతులు సాగు చేస్తున్న కీరదోస, చామంతి, వరి పంటలను నెల్లూరు జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ప్రాజెక్ట్ డైరెక్టర్ శారదా బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ఛాంపియన్ రైతులు మిగిలిన రైతులకంటే భిన్నంగా వ్యవసాయ సాగు చేసి అందరికి ఆదర్శంగా నిలవాలన్నారు. అదేవిధంగా రైతులకు ఆత్మ తరుపున ప్రోత్సాహకాలు అందించుట జరుగుతుందని ఛాంపియన్ రైతులకు తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు డిఆర్సి ఏడిఏ మారుతిదేవి, పొదలకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శివ నాయక్, మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్, ఉద్యానశాఖ అధికారి ఆనంద్, వ్యవసాయ అధికారి యు.గీతకుమారి, వ్యవసాయ విస్తరణ అధికారులు రాజమోహనరెడ్డి, శ్రీకాంత్, వీఏఏలు హేమలత, కౌసల్య ఛాంపియన్ రైతులు ముక్కు మాధవయ్య, సంఘపు చిరంజీవి, జానా మల్లికార్జున పాల్గొన్నారు.

# ఎస్ఈఐఎల్ ఎనర్జీ వైద్య సేవలు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** గోపాలపురం కేంద్రంగా బుధవారం ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో సంచార వైద్య వాహనం ద్వారా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటైంది. సుమారు వంద మందికి పైగా ఉచిత వైద్యాన్ని పొందారు. బిపి, షుగర్‌తో పాటు దీర్ఘకాలిక, సాధారణ వ్యాధులకు వైద్యబృందం ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. అనంతరం వైద్యులు మాట్లాడుతూ.. ఇచ్చిన మందులను సక్రమంగా వినియోగించుకుంటూ రోగాన్ని నివారించుకోవాలని తెలియజేశారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా వైద్య శిబిరం నిర్వహించినట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.